మన దేశంలో స్వాతంత్ర్యం  కోసం చేసిన తిరుగుబాటులు, తిరుగుబాటుదారులు చాలా ప్రత్యేకంగా చూడబడతారు. ఆంగ్లేయులపై తొలి నాటిలోనే తిరుగుబాటు చేసినవారి గురించి తగు చర్చ జరగనే జరుగుతుంది. వీరపాండ్య కట్టబొమ్మన్ మొదలగు పాలెగాండ్లు బ్రిటీషు వారిపై తిరుగుబాటు చేసారని, 1799లో ఉరితీయబడ్డారని అందరికీ తెలిసిన విషయమే. అయితే, 1847లో ఉయ్యాలవాడ పాలెగాండు అయిన మజ్జారి నరసింహారెడ్డి తిరుగుబాటు చేసి ఉరి వేయించుకోవటం, మెగాస్టార్ చిరంజీవి గారి పుణ్యాన, పరచూరి బ్రదర్స్ చొరవన బయటకు వచ్చింది. వీరందరి కన్నా ముందు, బ్రిటీషు వారి గుండెల్లోకి దూరి గర్జించిన తోటపల్లి ఎస్టేటు జమీందారు (పాలెగాండు) అయిన శ్రీ శ్రీ శ్రీ రాజా యనుముల జగ్గప్పదొర  గూర్చి ఎంతమందికి తెలుసు? తోటపల్లి కొండలలో తిరుగుబాటు ప్రకంపనలను చరిత్రలో ప్రతిధ్వనించేలా, బ్రిటీషు ఆధిపత్య తరంగాలను ధిక్కరించి, తిరుగులేని స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచి, 1770లలో పురివిప్పిన కథే ఈ రాజా యనుముల జగ్గప్పదొరది . ఈ కథ ప్రతిఘటన, ద్రోహం మరియు అధికార ప్రకటనకై బ్రిటీషు వారు చేసిన కనికరం లేని కర్కష క్రుత్యానికి సాక్షీ భూతంగా నిలుస్తుంది.

ఉత్తర సర్కారు జిల్లాలపై బ్రిటీషు ఈస్ట్ ఇండియా కంపెనీ సంపూర్ణ అధికారం సంపాదించుకుంది. 1765లో రాజమహేంద్రవరం జిల్లాను, కంపెనీ వారు సంపూర్ణ హక్కులతో పాలించడం ప్రారంభించారు. అయితే ఊహించనట్టి విధంగా తోటపల్లి, జరగనున్న యుద్ధానికి సాక్షిగా నిలిచింది. చరిత్ర తనని తానే వెలికితీసినట్లు, ఒక తెగువ అనే యుద్ధ నౌకని పురిగొలిపి పిలిచినట్లు, జగ్గప్పదొర  అనే పాలెగాండిని పిలిచి ఈ కధకు కధానాయకుడిని చేసింది.

తోటపల్లి ఎస్టేటు, పెద్దాపురం జమీందారీలోని ఒక భాగం.  103 గ్రామాలు కలిగిన ఈ ప్రదేశాన్ని రాజా యనుముల బాపం దొరకు, పెద్దాపురం మహారాజు అందించారు. అయితే ఆనాటి నుండి తోటపల్లి పాలెగాండ్లు పెద్దాపురం వారికి 500 పగోడాలు చెల్లించాలి. దానితో పాటు మహారాజుకి అవసరం వచ్చిన సమయంలో సైనిక సహాయం చేయాలి. ఈ విధంగా, తోటపల్లి యనుముల వారు 200 ఎకరాలలో కోట కట్టుకొని, 700 మంది సిపాయులతో, వెదురు మరియు టింబర్ అమ్ముతూ సస్యశ్యామలంగా ఉండేవారు.

అయితే, ఒక సమయమున, పెద్దాపురం దివాణు అయిన రాఘవరాజుకు తోటపల్లి వారిని చూసి ఈర్ష్య కలిగింది. విజయనగరం మహారాజు కానీ, ఏ యితర మహారాజులు అయినా, పెద్దాపురంలో మహారాజు గారి తరువాతి స్థానం తోటపల్లి వారికి యివ్వడం చూసి  ఓర్వలేకపోయాడు. యిలా ఉన్నప్పుడు, బ్రిటీషు ప్రభుత్వం వచ్చింది. వారు జగ్గపదొరను, వెదురు మరియు టింబర్ ఉచితంగా ప్రభుత్వ (కంపెనీ) కట్టడాలకు యివ్వమని అడిగారు. అది జగ్గపదొరకు నచ్చలేదు. ఇదే అదునుగా భావించి, దివాణు రాఘవరాజు, జగ్గపదొరకు " నువ్వు ఒప్పుకుంటే, అలా అడుగుతూనే ఉంటారు. కనుక ఒప్పుకోకు అని సలహా ఇచ్చాడు." సలహా చిన్నదే అయినా, నైజాం నవాబుల్నే శాసిస్తున్న కంపెనీ వారికి ఎదురుతిరగటం అందరి తరం కాదు. అయినా, తనపై అధికారం చెలాయించే అవకాశం వారికి ఇవ్వనని , బ్రిటీషువారి అభ్యర్ధనను జగ్గపదొర నిరాకరించారు. కేప్టెన్ మాథ్యే, బ్రిటీషు వారి తరుపున తగిన చర్చలు జరిపిన పిదప, జగ్గప్ప దొర తాను పెద్దాపురం నుండి విడిపోయి, స్వంత రాజ్యంగా పరిపాలిస్తే, బ్రిటీషు వారి అభ్యర్ధనను ఒప్పుకుంటానని వెల్లడించాడు.

ఉద్రిక్తత పెరగడంతో, జగ్గప్ప దొరపై కఠిన చర్యలు తీసుకుంటే మిగతా జమీందారులకు కూడా భయం వస్తుందని కంపెనీవారు నిర్ణయించుకున్నారు. ఉచ్చు బిగుసుకుంది. అయితే దానికి మూల కారణం అయిన, రాఘవరాజు, పెద్దాపురం రాజుని జగ్గపదొరపై రెచ్చగొట్టడం ప్రారంభించాడు. పెద్దాపురం రాజుకు జగ్గపదొర అంటే చాలా యిష్టం . పైగా అతడికి ఎదురు తిరగటం కూడా యిష్టం లేదు. అదీ నిజమే, కేప్టేన్ మాడ్లేతోనే "the truly troublesome fellow (అసాధ్యుడు)" అని అనిపించుకున్న జగ్గప్ప దొరని ఢీకొనాలని కోటిక ఎవరికైనా ఎందుకుంటుంది. పైగా అంతటి భలశాలి తనవైపున ఉంటే తన బలం మరింత మెరుగుపడుతుంది కదా. కానీ అప్పటికే రాఘువరాజు రెండవ మొఖం చూసిన జగ్గప్ప దొర పెద్దాపురంపై కోపంతో రగిలిపోయాడు.

యిలా జరుగుతుండగా, జగ్గపదొరను అంతమొందించటానికి, బ్రిటీషు వారు భారి బలగాన్ని సిద్ధం చేసింది. పిఠాపురం నీలాద్రిరావు, కోట రామచంద్రపురం రాజు మరియు అటువంటి పాలెగాండ్ల నుండి సైనిక సహాయం తీసుకుంది. పెద్దాపురం రాజుని బెదిరించి వారి నుండి కూడా సైనిక సహాయం పొందింది.

కానీ, అవి ఏ మాత్రం పని చేయలేదు. జగ్గప్ప దొర కాలిని కూడా ముట్టకుండానే పోరుకు వెళ్లిన ప్రతిసారి వెనుదిరిగారు . ఇక చేసేది ఏమి లేక , బ్రిటీషువారు . రాఘవరాజుతో గూడి చెండాలమైన కుతంత్రాన్ని పన్నారు. జగ్గప్ప దొర ను చర్చలకు పిలిచినట్లుగా పిలిచి ఖైదు చేయాలనుకున్నారు. కానీ చర్చ జరుగు ప్రాంతానికి ముందుగానే రాఘువరాజు గురించి ఎరిగిన జగ్గప్ప దొర , సంసిద్ధుడిగా , సంపూర్ణ బందోబస్తు తో వచ్చాడు. అలా వచ్చిన జగ్గప్ప గుర్రపు డెక్కల మట్టిని కూడా ఖైదు చెయ్యలేకపోయింది ఈస్ట్ ఇండియన్ కంపెనీ. అప్పటికే సుమారు 2000 మంది సైన్యాన్ని సేకరించాడు జగ్గప్ప దొర . దానికి తోడు, రాంపా, జడ్డంగి పాలెగాండ్లు కూడా, జగ్గప్పకి తోడుగా నిలిచారు.

ఉడికిపోయిన బ్రిటీషువారు, జగ్గప్పదొర ప్రాంతాలను తగలబెట్టడం ప్రారంభించారు. ఏ ఫలితం లేకపోవడంతో , జగ్గప్పదొర పినతండ్రి కుమారుడు అయిన రాజన్న దొరకు తోటపల్లి సింహాసనం ఎరగా చూపించి, తమవైపుకు తిప్పుకున్నారు. కానీ, రాజన్నదొర కూడా, తన సోదరుడి తెగువను చూసి, తిరిగి బ్రిటిషువారి ఎత్తుగడాలని అడ్డుకుని తోక ముడిచేలా చేసాడు.

అన్ని ప్రయత్నాలు విఫలించడంతో బ్రిటీషువారు,ఆరు బెటాలియన్లతో కాపుకాసి, ఫిబ్రవరి 20 ,1771 వేకువ జామున, నిరాయుధుడిగా , ఆద మరచి వున్న జగ్గప్పదొరను ముట్టడించారు. లక్ష బుల్లెట్లు తీసుకుని వెళ్లిన బ్రిటీషువారు కాల్పులు జరపడం ప్రారంభించారు. అలా, ఆరోజున , తెగువ అనే యుద్ధనౌక కపటానికి బలైంది. సోదరుడి మరణ వార్త విన్న రాజన్న దొర , భయంకర రూపం ధరించి, సంపూర్ణ పెద్దాపురం జమిందారి పై యుద్ధం ప్రకటించినట్టు, దాడి చేయడం ప్రారంభించాడు. జగ్గప్పదొర ను అప్పగిస్తేయ్ స్వంత రాజ్యం ఇస్తాను అని ప్రకటించినప్పటికి సోదరుడి చేయి వీడని రాజన్న దొర , ఈ వార్తను జీర్ణించుకోలేకపోయారు. బ్రిటీషువారు, రాజన్న దొర తో శతృత్వం, మరింత నష్టాన్ని తీసుకువస్తుంది అని గ్రహించి, రాఘవరాజుని చంపి రాజన్నదొరకు బహుమతిగా పంపారు. ఈ విధంగా చేసి, రాజన్న దొరను తోటపల్లి రాజుగా ప్రకటించారు. జగ్గప్పదొర పెట్టిన భయానికి , బ్రిటీషువారు, రాంపా, జడ్డంగి, తోటపల్లి ఎస్టేట్లను పెర్మనెంట్ సెటిల్మెంట్ లో కలపలేదు.

జగ్గప్ప దొర  పోరాట పటిమ ఎనలేనిది. తెగువ పోల్చలేనిది. ఆయన పేరు తలవగానే నీటి మనుషులు గుర్తుపట్టకపోవచ్చును కానీ , తోటపల్లి కొండల్లోకి వెళ్లి ఆ పేరుని పిలవగానే , ఆ మహావీరుడి గాధకు, సాక్షులైన గాలి, నింగి, కొండలు, లోయలు, వాగులు, వంకలు, చెట్లు, పుడమి ఉవ్వెత్తున ఎగసి జయహో జగ్గభూపాలా అని దిక్కులు పిక్కటిల్లేలా  అరుస్తాయి.